# నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | ఆదివారం 21 జూలై 2024 | MAHABUBABAD


## రూ.50వేల రుణమాఫీ కాలేదు



ప్రభుత్వం రూ. లక్షలోపు రైతులు తీసుకున్న రుణాన్ని మాఫీ చేసినట్లు మాటల్లో చెప్పడం తప్ప అమలు చేయడం లేదు. నాకున్న ఎకరంన్నర భూమిలో వరి సాగు కోసం కొండాపురం సిండికేట్ బ్యాంకులో గత ఏడాది రూ.50 వేల రుణం తీసుకున్నా. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ లిస్టులో నా పేరు లేకపోవడంతో చాలా బాధపడ్డాను. నాకు లేని అర్హత ఏంటని కుంగిపోయాను. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించగా ఇంకా పూర్తి స్థాయిలో ప్రభుత్వం నుంచి లిస్టు రాలేదని చెబుతున్నారు. అసలు నాకు రుణమాఫీ అవుతదో? కాదో? తెలవడం లేదు. ప్రభుత్వం మాత్రం రూ. లక్షలోపున్న రుణాలన్నింటినీ మాఫీ చేశామని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. ఒక పక్క పంట సాగు పనులు పూర్తవుతున్నా రైతుభరోసా డబ్బులు రాక, మరోపక్క రుణమాఫీ కాక, పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని నిద్రపట్టడం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి అన్ని అర్హతలున్న నా రుణాన్ని మాఫీ చేయాలని కోరుతున్నా. *– మధుకర్, రైతు, గుర్తూరు, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా*

## నల్లబెల్లి నుంచే ఎక్కువ ఫిర్యాదులు

### రుణమాఫీపై రెండు రోజుల్లో 49 కంప్లయింట్లు

ఖిలావరంగల్, జూలై 20: పంట రుణమాఫీ సమస్యలు చెప్పుకొనేందుకు వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు రెండు రోజుల్లో 49మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. వరంగల్ జిల్లాలో అత్యధికంగా నల్లబెల్లి మండలానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. జాబితాలో తమ పేర్లు లేవని కొందరు, అర్హులైనా తమ పేర్లు రాలేదని మరికొందరు, రుణం మాఫీ అవుతుందో లేదో ఎవరిని అడగాలని ఇంకొంతమంది రైతులు టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తమ ఆవేదనను వెలిబుచ్చారు.

## నాకు ఎందుకు మాఫీ కాలేదు



నేను పాలకుర్తి ఏపీజీవీబీ బ్యాంక్‌లో రూ. 80 వేలు లోన్ తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలిసి బ్యాంక్‌కు వెళ్తే అధికారుల వద్ద ఉన్న లిస్టులో నా పేరు లేదని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో కొంత మాఫీ చేశారు. రెన్యువల్ కూడా చేసుకున్నాను. రుణమాఫీపై అంతా అయోమయంగా ఉంది. జాబితాలో లేని రైతులకు రుణమాఫీ జరుతుందా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.
*– గాదె మల్లారెడ్డి, రైతు, పాలకుర్తి, జనగామ జిల్లా*



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

# ధైర్యశాలి.. దాశరథి

- నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు
- చిన్నగూడూరులో జన్మించడం మన గర్వకారణం
- రేపు శతజయంతి ఉత్సవాలు
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూలై 20: అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచార్యులు ధైర్యశాలి అని, నిరంతరం పేదల పక్షాన ఉన్నారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో దాశరథి కృష్ణమాచార్యులు జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాశరథి కృష్ణాచార్యులు నిజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడని, పేదలకు న్యాయం చేసేందుకు అనేకసార్లు జైలు జీవితం గడిపారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మానుకోట జిల్లా చిన్న గూడూరు మండల కేంద్రంలో జన్మించడం గర్వకారణమన్నారు. నిజాంకు వ్యతిరేకంగా తిరగబడినందుకు నిజామాబాద్ జైలులో ఏళ్ల తరబడి నిర్బంధించగా జైలు గోడలపై 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అని రాశారని తెలిపారు. తన కవితలు, రచనలతో ఎంతో మందిని చైతన్యం చేశారని చెప్పారు.

*శతజయంతి ఉత్సవాలు*

ఈనెల 22న దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తొలుత దాశరథి పుట్టిన ఊరైన చిన్న గూడూరులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి కవులు, రచయితలతో కలిసి పట్టణ కేంద్రంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌కు భారీ ర్యాలీగా చేరుకోనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం జిల్లాలోని కవులు, రచయితలతో దాశరథి కవిత్వం, రచనలపై చర్చాగోష్టి, పట్టణ పుర ప్రముఖులతో చర్చా వేదిక ఉంటుందని వివరించారు. దాశరథి పేర స్మృతివనం, ఆడిటోరియం, కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు బానోత్ రవికుమార్, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, కన్న, వెంకన్న, రామకృష్ణ, కరుణాకర్, కమలాకర్, శంకర్, శివ పాల్గొన్నారు.




రైతులకు రుణమాఫీ రంది పట్టుకున్నది. కొందరికి మాత్రమే లబ్ధిచేకూరగా మాఫీ కాని వారు సరైన సమాచారం లేక ఆందోళన చెందుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. ముఖ్యంగా పీఏసీఎస్‌ల పరిధిలో ఉన్న రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల్లో చాలామంది అర్హులున్నా వారి పేర్లు జాబితాలో గల్లంతుకావడం అనుమానాలకు తావిస్తున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలో సహకార సంఘాల లెక్కలను పరిశీలిస్తే సుమారు 70శాతం మందికి రుణమాఫీ కాలేదని తెలుస్తోంది. దీంతో వారు శనివారం చాలాచోట్ల అటు సొసైటీలు, బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీసిన రైతులు తమకెప్పుడు మాఫీ అవుతుందని ప్రశ్నిస్తున్నారు.

**– జయశంకర్ భూపాలపల్లి, జూలై 20(నమస్తే తెలంగాణ)/ నర్సంపేట/ నెక్కొండ/ వర్ధన్నపేట/ నర్సింహులపేట/ ఖానాపురం**

# మాకెప్పుడు మాఫీ?

**సహకార సంఘాల పరిధిలో రైతుల్లో ఆందోళన**

- ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో 70శాతం కాని వైనం
- మిగతా బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి
- బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్న రైతులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్షలోపు రుణమాఫీ ఎప్పుడవుతుందోనని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా జిల్లాల్లోని పీఏసీఎస్‌ల పరిధిలోని రైతుల్లో 70శాతం మందికి రుణమాఫీ జరగలేదు. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని అర్హతలున్నా తమ పేరు లిస్టులో లేకపోవడంతో బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తమ రుణం మాఫీ అవుతుందో? లేదో? అని ఆవేదనకు గురవుతున్నారు. వరంగల్ జిల్లాలోని చెన్నారావుపేట సొసైటీలో నర్సంపేట, నెక్కొండ, గూడూరు, చెన్నారావుపేట, ఖానాపురం మండలాలకు చెందిన 20 గ్రామాల పరిధిలోని 9,626 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రూ. రెండు లక్షల మాఫీలో 5,768 మంది సభ్యులకు అర్హత ఉండగా, మొదటి విడుత రూ. లక్ష మాఫీలో 4వేల మంది రైతుల పేర్లు రావాల్సి ఉంది. కానీ, ఇప్పటికీ ఒక్క రైతుకు కూడా మాఫీ కాలేదు.

*నెక్కొండ పీఏసీఎస్ పరిధిలో*

నెక్కొండ : నెక్కొండ పీఏసీఎస్ పరిధిలో రూ. లక్షలోపు రుణాలున్న 1,222 మంది రైతుల జాబితాను పంపించగా 564 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఒక్క రోజే 50 మంది రైతులు రుణాల వివరాల కోసం ఏఈవోలను సంప్రదించారు.

*జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..*

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 10 పీఏసీఎస్‌లుండగా వాటిలో 10,931 మంది రైతులు రూ. లక్షలోపు రుణం తీసుకున్నారు. ఇందులో 2,863 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. మహదేవ్‌పూర్ మండలంలో 434 మంది రైతులకు 171 మందికి, మల్హర్ మండలంలో 590 మందికి 190, చిట్యాల మండలంలో 1134 మందికి 291, కాటారంలో 1157 మందికి 428, మహాముత్తారంలో 659 మందికి 266, జంగేడులో 900 మందికి 346, చెల్పూర్‌లో 382 మందికి 202, గణపురంలో 2919 మందికి ఏ ఒక్కరికీ రుణమాఫీ జరగలేదు. అలాగే రేగొండ మండలంలో 1,576 మందికి 739, మొగుళ్లపల్లిలో 1,180 మందికి 290 మాత్రమే రుణమాఫీ జరిగింది.

### వర్ధన్నపేట పీఏసీఎస్ పరిధిలో

వర్ధన్నపేట : వర్ధన్నపేట పీఏసీఎస్ నుంచి 925 మంది రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతుల జాబితాను అధికారులు గతనెలలోనే ప్రభుత్వానికి అందించారు. కానీ ఇందులో కేవలం 490 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. దీంతో మాఫీ జరగని వారు ఆందోళనకు గురవుతున్నారు.

### డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో..

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజవర్గంలోని ఆరు మండలాల పరిధిలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 7,345 మంది ఉండగా కేవలం 1,716 మందికి మాత్రమే రుణమాఫీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. కురవి, గుండ్రాతిమడుగు పరిధిలోని ఎఫ్‌ఏసీఎస్(సీనియర్ సొసైటీ)లో రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులు 2,037 మందిలో ఒక్కరికి కూడా మాఫీ వర్తించలేదు. మరిపెడ, చిన్నగూడూరు మండలాల్లోని పీఏసీఎస్ పరిధిలో 1,833 మందికి 786, నర్సింహులపేట, దంతాలపల్లి పరిధిలో 1,543 మంది కి 501, డోర్నకల్ పీఏసీఎస్ పరిధిలో 620 మందికి 135, మన్నెగూడెం పరిధిలో 582 మందికి ఉండగా 178 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు అధికారులు ప్రకటించారు. డీసీసీ పరిధిలో కేవలం 30 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు చెబుతున్నారు.

### పొంతన లేని సమాధానాలిస్తున్నరు..



నేను, నా భర్త నర్సయ్య ఇద్దరం మాకున్న వ్యవసాయ భూముల పట్టా పాసు పుస్తకాలను రాయపర్తిలోని ఎస్‌బీఐలో పెట్టి పంట రుణం తీసుకున్నాం. బ్యాంకు సిబ్బంది చెప్పినప్పుడల్లా రుణాలను రెన్యువల్ చేసుకుని వడ్డీ డబ్బులు చెల్లించినం. కానీ ఇప్పుడు రుణాలమాఫీ రావడంతో బ్యాంకర్లు చెప్పే సమాధానం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. నా భర్త నర్సయ్య పంట రుణం రెన్యువల్ అయినందువల్ల మాఫీ వర్తిస్తుందని, నీ క్రాప్ లోన్ ఇప్పటి వరకు రెన్యువల్ చేసుకోకపోవడంతో మాఫీ రాదు అంటూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. ప్రతిసారి మేము ఇద్దరం బ్యాంకుకు వచ్చి పంట రుణాలు రెన్యువల్ చేసుకుని వడ్డీలు చెల్లించాం. కానీ గీ సర్కారు గిట్ల మమ్మల్ని గోస పుచ్చుకుంటాంది. *– మామిండ్ల రాణమ్మ, కాట్రపల్లి, రాయపర్తి*



రాయపర్తి : ఎస్‌బీఐలో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు



గణపురం : రోడ్డుపై నుంచి పొంగుతున్న మోరంచవాగు



మహదేవపూర్ : పెద్దంపేటలో రెస్క్యూ సిబ్బందితో కలిసి బోట్‌లో ప్రయాణిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



కాటారం : గోపాల్‌పూర్‌లో నీట మునిగిన పంట పొలాలు



వెంకటాపూర్ : కాటేశ్వరాలయంలో లీకేజీ



బయ్యారం : పెద్దగుట్టపై జాలువారుతున్న పాండవుల జలపాతం



కాళేశ్వరం : పుష్కరఘాట్ వద్ద గోదావరిని పరిశీలిస్తున్న అధికారులు



వెంకటాపురం (నూగూరు) : సీహెచ్‌సీకి చేరుకున్న గర్భిణులు



కాటారం : శంకరంపల్లిలో కూలిన ఇంటి పైకప్పు

# వాన.. వరద

- ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం
- స్తంభించిన జనజీవనం.. ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు జలకళ

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. క్షణం కూడా గెరువివ్వకపోవడంతో జన జీవనం స్తంభించింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. రోడ్లపై వరద ఉధృతికి ఏజెన్సీలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు నేలమట్టమయ్యాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాలో మోస్తరుగా వర్షం కురవగా, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలో భారీగా వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు చేరుతున్నది. బయ్యారం మండలంలోని పెద్దచెరువు గరిష్ఠ నీటిమట్టం 16.5 అడుగులు కాగా, అడుగు మేర మత్తడి పోస్తుంది. వినోబానగర్‌లోని తులారం ప్రాజెక్ట్, గౌరారం, వట్టెవాగు కట్టు మత్తడి దుంకుతున్నాయి. బయ్యారం పెద్దగుట్టపై పాండవుల జలపాతం, చింతోనిగుంపులోని వంకమడుగు జలపాతం జాలువారుతున్నాయి. మసివాగు, పంది పంపుల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గార్ల సమీపంలోని పాకాల ఏరు ఉప్పొంగుతున్నది. భారీ వర్షాల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సహాయం కోసం 8712656928 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం ఆలుబాక పరిధి తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) గురువారం గోదావరి నదిలోకి చేపలవేటకు వెళ్లి గల్లంతయ్యాడు. అతడి మృతదేహం శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి రేవు సమీపంలోని దొరికింది.

*సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు..*

ఏటూరునాగారం/వెంకటాపురం(నూగూరు): ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామంలోని ఇద్దరు గర్భిణులు పులిశె అనూష, దబ్బగట్ల శైలజను బోటు ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొండాయి గ్రామంలో ఫిట్స్‌కు గురైన వృద్ధురాలు మాదాటి పోషమ్మను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బోటులో దొడ్లవాగు ఒడ్డుకు చేర్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. అలాగే వెంకటాపురం(నూగూరు) మండలం ఎదిరా పీహెచ్‌సీ పరిధిలోని 9 మంది గర్భిణులు వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో 102 వాహనలో మండలం కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. ముంపు గ్రామాలైన ముకునూరుపాలెం, కాలిపాక, ఆర్సీపురం, పాత్రాపురం, అంకన్నగూడేనికి చెందిన గర్భిణులు లలిత, సుగుణ, భారతి, స్వరూప, కావ్య, అమల, శివాణి, ఆదిలక్ష్మి, లలితను ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



వాజేడు : ప్రగళ్లపల్లి వద్ద పంటపొలాల్లోకి చేరిన వరదనీరు

*ఉధృతంగా మోరంచవాగు*

గణపురం : మండలంలోని అప్పయ్యపల్లి, వెళ్తుర్లపల్లి గ్రామాల మధ్యలోని మోరంచవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో మండల కేంద్రానికి వాగు అవతలి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

*లక్నవరానికి జలకళ*


గోవిందరావుపేట : గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీటి మట్టం 33.5 అడుగులు కాగా, శనివారం సాయంత్రం నాటికి 18.6 అడుగులకు చేరుకుంది.

*ఉప్పొంగుతున్న గోదావరి*

కాళేశ్వరం వద్ద గోదావరి నది 4 లక్షల క్యూసెక్కులతో 09.01 మీటర్ల ఎత్తులో, ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 12.210 మీటర్లు, వాజేడు మండలం పేరూరు వద్ద 13.140 మీటర్లు ఎత్తులో పారుతున్నది. చీకుపల్లి అటవీప్రాంతంలోని తెలంగాణ నయాగర బొగత జలపాతం సుమారు 50 అడుగులపై నుంచి పాలసముద్రంలా జాలువారుతున్నది. పెద్ద ఎత్తున తరలివచ్చిన పర్యాటకులు బొగత అందాలకు ఫిదా అయ్యారు.

*వెంకటాపూర్(నూగూరు)లో అత్యధికంగా 71 మి.మీ*

శనివారం ములుగు జిల్లాలో 39.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా వెంకటాపూర్(నూగూరు)లో అత్యధికంగా 75.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 25.8 మిల్లీమీటర్లు కాగా, అత్యధికంగా రేగొండ మండలంలో 40.4మి.మీ, జనగామ జిల్లాలో 10.7మి.మీ కాగా, అత్యధికంగా కొడకండ్లలో అత్యధికంగా 15.4 మిమీ కురిసింది. అలాగే మహబూబాబాద్ జిల్లా సగటు వర్షపాతం 39.2 మిమీ కాగా, అత్యధికంగా బయ్యారం మండలంలో 71 మి.మీ, వరంగల్ జిల్లా సగటు వర్షపాతం 24.9 మిమీ కాగా, ఖానాపూర్ మండలంలో 28.4 మిల్లీమీటర్లు, హనుమకొండ జిల్లా సగటు వర్షపాతం 16.30 మిల్లీ మీటర్లు కాగా, అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 24.50 మిల్లీమీటర్లుగా నమోదైంది.



వాజేడు : మత్తడిపోస్తున్న గుండ్లవాగు ప్రాజెక్టు





